# 1

## ముఖచిత్రం

గౌరీపతిగారు కిటికీలోంచి వీధిలోకి చూస్తున్నారు. 'ఇవాళ శుక్రవారం. పూజకి కొబ్బరికాయా వగైరాలు తెప్పించాలి' అని చెప్పటానికని అనసూయమ్మగారు ఆ గది గుమ్మంవద్దకు వచ్చింది. భార్య వచ్చినట్లు ఆయనకు తెలిసిందే కాదు.

"ఏమిటిచెప్మా అంత తీక్షణంగా చూస్తున్నారు?" అనుకుంటూ ఆమె నోరు మెదపకుండానే వీధిలోకి చూసింది. ఎత్తు మడమల జోడు వేసుకొని, ప్లాస్టికు బ్యాగు పుచ్చుకొన్న పాతికేళ్ళ యువతి ఒకామె ఆమెకు ఇట్టే కనపడి, అట్టే మాయమైంది. అనసూయహృదయంలో అసూయ మొలకెత్తి, మొక్కయై, దశదిశలా

శాఖలు పెంచి, యిట్టే మహావృక్షమై నిలిచింది.
"నలభై అయిదేళ్ళు నెత్తికొచ్చిన ఈయనకు యిదేం పోయేగాలం? ఆమ్మమీద కుంపటికిమల్లే యింట్లోవున్న పద్దెనిమిదేళ్ళ పెళ్ళిగాని పిల్లకి సంబంధ మింకా కుదరలేదని నేనిదాతూంటే ఈయన చీమకుట్టినట్టయినా లేకుండా వూరు కోడమే కాకుండా, వీధమ్మటపోయే ఆడవాళ్ళని చూస్తు న్నారు! నైజలక్షణానికీ, తప్పు కంటికీ మందులేదుట! ఎన్నేళ్ళు వస్తేం? వంకరబుద్ధి తిన్నబడదు" అనుకుంది.

ఆమె ఇంకా యేమనుకొనేదోగాని, యింతలో ఆయన వెనక్కి తిరిగి, ఆమె కనబడ్డంతోనే, "ఏం కావాలి?" అన్నారు. ఆమె ఉగ్రురాలై, "ఏమిటా? నా శ్రాద్ధం!" అంది. ఆయన మాట్లాడలేదు. ఆయనమౌనం ఆమెకు నిప్పులో నెయ్యి పోసినట్లై యింక వుండబట్టలేక, "ఏమి టలాగ వీధికేసి తెగ చూస్తున్నారు?" అని అడిగేసింది.

"వాడెవడో తెలిసింది కాదు నాకూను" అన్నా డాయన.

"'వాడు' అంటారేం? 'అది', 'ఆమె', 'ఆ సుందరి' అనక!"

"ఏ సుందరి?"

"ఆ సుందరే. మేనక, ఊర్వశి, రంభ లేక తిలోత్తమ. ఎవర్తో ఆ తొత్తు పేరుకూడా తెలవాలా నా ఖర్మం కాలితే?"

వరాండాలో మంచంమీద పడుక్కున్న మూడుకాళ్ళ ముసలి, పార్వతమ్మగారికి కొడుకూ కోడలూ పడుతూన్న

ఘర్షణ చెవిని పడింది. "ఏమర్రా, మళ్ళీ ప్రారంభించారా? నే బతికున్నంతకాలం మీ కీ దెబ్బలాటలు తప్పవుగామోసు?" అంది. ఆమెకు దగ్గురోగం. దగ్గు వచ్చినా, ఇంట్లో మరేమి వచ్చినా, 'యింకా నేనెందుకు బతికివున్నానా?' అనుకోడం ఆమెకు మామూలు.

"నువ్వు బతికివుండటానికీ, అమ్మా నాన్నా తగవులాడుకోడానికీ సంబంధ మేమిటి?" అంది నవ్వుతో, పద్ధెనిమిదేళ్ళ మనుమరాలు.

"ఎందుకు కీచులాడుకుంటున్నారు మరి?"

"ఏమో, నాకేం తెలుసు?"

"దాని కెలా తెలుస్తుంది, ఎందుకో నాకే తెలవనప్పుడు?" అన్నాడు గౌరీపతి.

వెనకాలే వచ్చిన అనసూయమ్మ, "మీ కే తెలవదేం? ఎంత నంగనాచులు!" అంది త్రాచుపాములాగ.

"ఏమిటో చెప్పరాదూ, అత్తైతే?" అంది కుమార్తె. కాని ఆ పిల్లయెదుట యేమీ చెప్పిందికాదు అనసూయ. 'పాలు పొయ్యిలో పడ్డ వాసనేస్తోంది' అంది ముసలమ్మ. అనసూయ వంటింట్లోకి పరుగెత్తింది.

అనసూయ కొబ్బరికాయ మాట భర్తతో చెప్పనే లేదు. అసలింక ఆయనతో తను మాట్లాడకూడ దనుకుందామె. టెంకాయ దాసీదానిచేత తెప్పించుకుందా మనుకుంది. కాని, దాసీది మూడణాల కాయ మూడణాలన్నరకు కొన్నానని చెప్పి, అర్ధణా కమీషను కొట్టేస్తుంది! దాన్ని పంపి లాభం

లేదు. "శ్యామలా, వీధిచిగురు కొట్టు కొక్కమాటు వెళ్లి, కొబ్బరికాయా, కర్పూరం తే" అని కూతుర్ని పంపింది. ఆ యింటికి కూతురైనా, కొడుకైనా ఒక్క శ్యామలే! అందు చేత గౌరీపతిగారు యింట లేని సమయంలో అర్జంటుగా యేం కావలసొచ్చినా శ్యామల వీధిచిగురు కొట్టుకు వెళ్ళి తేవటం వుంది. కాని ఆమె ఆనాడు గుమ్మం దిగుతోండగా చూసిన గౌరీపతి, 'యెక్కడికి?' అంటూ ఆపేశాడు.

"కొబ్బరికాయా, కర్పూరం తెమ్మంది అమ్మ. ఇవాళ శుక్రవారం కదూ? పూజకి."

"దానికి లేకపోతే నీకైనా వుండొద్దూ బుద్ధి? నువ్వా కొట్టుకు వెళ్ళటం?" అని కోప్పడ్డాడు గౌరీపతి. ఆయన యెందుకు కోప్పడ్డాడో శ్యామలకి అర్థమవలేదు. అంతకు ముందు రోజునేగా, ఆమె కొట్టుకు వెడుతో ఆయనకు యెదురైతే? అప్పుడేమీ అనలేదే? "అమ్మమీద కోపం వస్తే, నన్నెందుకో కోపపడడం?" అని నాయనమ్మతో మెల్లిగా ఫిర్యాదు చేసింది శ్యామల. గౌరీపతి వెళ్ళి కొబ్బరికాయా, కర్పూరం, అగరువత్తులూ తెచ్చాక, తల్లితో, 'శ్యామలేదీ?' అన్నాడు.

"పెరట్లో వుందికామోసు. దాన్ని యెందుకో చిరాకు పడ్డావుట?"

"పద్దెనిమిదేళ్ళు నెత్తికొచ్చి పెళ్లికాని దాన్ని కొట్టుకు పంపడం నీకు మటుకి బాగుందా?"

పార్వతమ్మ మనుమరాలికి యెనిమిదో యేడు వచ్చిన

తోనే 'పెళ్ళి, పెళ్ళి' అని ఘోషించింది. ఐతేం, కొడుకు విని వించుకోకుండా ఆ పదేళ్లూ గడుపుకొచ్చాడు. "ఎందుచేత చెప్మా యివేళ హఠాత్తుగా వీడికి తన కూతురు యెదిగిన పిల్ల అనీ, కొట్టుకీ అక్కడికీ వెళ్ళనివ్వకూడదనీ తోచిందీ?" అని ఆశ్చర్యపోయిం దామె. 'ఇనుం యెఱ్ఱగా కాలివున్నప్పుడే సాగ గొట్టాలి. లేకపోతే లొంగదు' అనుకొని, ఆమె, "దాన్ని యింక యెక్కడికీ పంపనూరాదు; పెళ్ళిచెయ్యకుండా వుంచనూ రాదు" అంది. "నేనూ సంబంధాలు చూస్తూనే ఉన్నాను మరి" అన్నా డాయన. ఇదివరలో ఆ మాట వస్తే కొట్టవచ్చే కొడుకు ఆనా డలా సౌమ్యంగా జవాబుచెప్పడంతో ఆమెకు మరీ ఆశ్చర్యం వేసింది.

అంతకుముందు ప్రతీ శుక్రవారం అనసూయమ్మ పూజవేళ లక్ష్మీదేవిని 'శ్యామలకు మంచి పెళ్లి సంబంధం రావా'లని కోరుకునేది. ఆ వేళ ఆ వరంతోపాటు, 'తల్లీ, మహాలక్ష్మీ, నా భర్తబుద్ధి పెడదారిని బట్టకుండా కాపాడు' అన్న ప్రార్థన కూడా జోడించింది.

ఆ మర్నాడు మళ్ళీ గౌరీపతిగారు కిటికీలోంచి చూస్తు న్నాడు. అనసూయ కూడా కనిపెడుతూనే వుంది. కాని రోడ్డు మీద యెవరూ స్త్రీ వెడుతూ కనపడలేదు. "వెళ్ళిపోయుం టుంది. నేను రావటం ఆలస్యమైందన్నమాట" అనుకుం దామె. ఇంతట్లో, హఠాత్తుగా గౌరీపతిగారు, 'వెంకటేశూ, వెంకటేశూ' అని అరిచారు. తోటవాడు వెంకటేశు క్షణంలో వచ్చి నిలబడ్డాడు. గౌరీపతి తొందరగా "పరుగెత్తి వెళ్ళు.

ఆ వెళ్ళేమనిషిని ఇలా లాక్కురా. రాక పెనగులాడితే చావ గొట్టి తీసుకురా!" అంటూ కొంచెం దూరాన పోతూన్న సన్నటి, పొడుగాటి యువకుణ్ణి చూపించాడు.

వెంకటేశు బాణానికిమల్లే పరుగెత్తి వెళ్ళి, ఆ మనిషి రెక్క పట్టుకున్నాడు. ఆ యువకుడు నిర్ఘాంతపోయి, "వదులు. ఎందుకు నన్ను పట్టుకున్నావ్?" అన్నాడు.

"ఆ మాట మా యజమానినే అడగాలి. నాకేం తెల్సు? అక్కడికి పద" అంటూ వెంకటేశు అతగాణ్ణి గౌరీపతి దగ్గరకి లాక్కువెళ్ళేడు.

'ఏమిటి?' అంటూ దారిని పోయేవాళ్ళంతా గుమిగూడేరు. వాళ్ళలో ఒకాయన ఆ దొరికినవాడేదో దొంగతనం చేసివుంటాడని వూహించి, "ఏం దొంగిలించాడు?" అని ఎదురుగా వున్నవాణ్ణి అడిగేడు. ఆ యెదుటి ఆయన యువకుడి చేతిలో కనపడుతూన్న కెమేరాను చూపించి, "ఆ కెమేరా కొట్టేసి వుంటాడు!" అన్నాడు. ఆ మాట చెవిని పడ్డ పక్కవాడు, "కెమేరా యెత్తుకుపోతున్నాట్ట! పట్టపగలు! ఎంత ధైర్యమో చూడండి" అన్నాడు. "చూస్తారేం, కాయశుద్ధి చెయ్యక?" అన్నాడు ఒక వస్తాదు. "మనం చెయ్యి చేసుకోకూడదు. తీసుకుపోయి పోలీసులకి వప్పగిద్దాం" అన్నాడు 'లా' తెలిసిన ఒకడు.

ఇంతలో ఆ దారిని ఒక పోలీసు రానేవచ్చాడు. వచ్చి, 'ఏమిటి సంగతి?' అని వాకబుచేశాడు. "కెమేరా దొంగిలించి పట్టుకుపోతోంటే పట్టుకున్నాం" అన్నారంతా. "ఎవరిది ఈ

కెమేరా?'' అన్న ప్రశ్న వేశాడు కానిస్టేబులు. అందరూ గౌరీ పతిగారికేసి చూశారు. ఆయన, "ఆ కెమేరా మాది కాదు" అన్నాడు. "మరి ఎవరిది?"

"ఎవరిదేమిటి? నాదే. నేను ఫోటోలు తీసి పత్రికలకు పంపుతాను" అన్నాడు యువకుడు.

కానిస్టేబులుకి అంతా అయోమయంగా తోచి, "ఈ కెమేరా నీదే ఐతే వీరంతా నువ్వు దొంగిలించావంటా రేమిటి మరి?'' అన్నాడు.

"ఏడవలేకపోయారు! ఎవరు అంట నేను దొంగిలించానని?'' అన్నాడు యువకుడు.

ఆ మాట వినేసరికి అందరికీ కోపం వచ్చింది. ఆ మూగినవాళ్ళందరికేసీ తిరిగి కానిస్టేబులు, "ఎవరయ్యా, ఇతడు దొంగిలించాడన్నది?'' అని అడిగేడు. వాళ్ళంతా అన్నవాళ్ళే ఐనా, నేను కాదంటే నేనుకాదు అని వూరుకున్నారు. అందరూ వెంకటేశు కేసి చూశారు. వెంకటేశు గౌరీపతిగారికేసి చూశాడు. గౌరీపతిగారు, "ఈ అబ్బాయి ఏదో దొంగిలించాడని నేను పట్టుకోమనలేదు. ప్రహరీగోడ అవతల నిలబడి ఎందుకో లోపలికి పదేపదే తొంగిచూసి పోతూంటే, పిలిచి కూకలేసి పంపుదామని రప్పించాను. నిన్ననూ ఇలాగే చూడటం మొదలెట్టేడు. సంసార్ల ఇళ్ళల్లోకి ఇలా చూడవచ్చా చెప్పండి!'' అన్నాడు.

"పోకిరీతనం గాకపోతే యేమిటి? ఆ యిజానూ, ఆ

జుబ్బా, ఆ క్రాపింగూ చూస్తేనే తెలుస్తోంది రౌడీ బాపతు అని'' అన్నాడొకడు.

''అందులో పెళ్ళీడుకొచ్చిన పిల్ల ఉన్న ఇల్లాయిరి! అలా చూడటం ఎంత తప్పు?'' అన్నాడు ఆ వీధివాడే, ఒకాయన. తక్కినవాళ్ళందరికీ ఆ యింట పెళ్ళికుమార్తె ఒకమ్మాయి ఉన్నదని అప్పుడే తెలిసింది.

''ఎన్నేళ్ళు వుంటాయండీ పిల్లకి?'' అన్నాడెవరో.

''ఎన్నైనా వుంటాయి. ఒక చెంప నెరుస్తేనేగాని ఇప్పుడు పెళ్ళిళ్ళే లేవుగా?''

ఈ ధోరణిలో సాగేయి నోళ్ళు. కానిస్టేబులికి విసుగెక్కువైంది. ''ఓ పిల్లకేసి కాస్త చూస్తే ఇంత గత్తరేమిటి?'' అనిపించిందతడికి. ''అబ్బాయ్, ఇంకెప్పుడూ ఇలాంటి పని చెయ్యకు! వెళ్ళు'' అన్నాడు. కాని ఆ అబ్బాయి వెళ్ళలేదు సరిగదా, 'ఎలాంటిపని?' అని వివరాలు అడిగేడు. '' 'పెళ్ళికాని పిల్లలున్న ఇంటికేసి తొంగి చూడకూడదు' అని చెపుతోంటే మళ్ళీ 'ఎలాంటి పని?' అంటావేమిటి? ఎక్కడో గడుగ్గాయి రకంలా వున్నావే చూస్తే?'' అన్నాడు ఒకాయన. ఆయన పక్కనున్నాయన అందుకొని, ''పెళ్ళికాని పిల్లలే కాదు, పెళ్ళి ఐన పిల్లలున్న ఇళ్ళకేసీ చూడకూడదు''అన్నాడు. ''అన్నట్టు, ఈయనకి రెండో పెళ్ళి భార్య!'' అని యెవరో ఆయనకి వినపడేటట్లే గుసగుసలాడేరు.

ఆ అబ్బాయి గౌరీపతిగారితో, ''అయ్యా, యథార్థం చెపుతున్నాను. మీకు ఓ అమ్మాయి వుందనే నాకు తెలవదు.

నిన్ననూ, ఇవాళా కూడా మీ యింటి వైపు తొంగిచూస్తే మీ అమ్మాయికోసం కాదు'' అన్నాడు.

''మరి యెవరికోసం?'' అన్న ప్రశ్న వెంటనే వచ్చింది. ఆ అబ్బాయి, ''ఆ వరాండాలో మంచంమీద పరున్న ఆ అవ్వగారికోసం'' అన్నాడు.

అంతకుముందే అవ్వకూడా గలభా ఏముటో తెలుసుకోవాలన్న కుతూహలంతో మెల్లిగా అక్కడకు చేరింది. ఆ అబ్బాయి అన్నమాటలు ఆమెచెవిలో పడ్డంతోనే ఆమె కోపంతో, ''ఓరి నీ జిహ్వ చీలికలై పోనూ! నా కోసంట్రా నువ్వు తొంగిచూస్త!''అని చేతిలో కఱ్ఱ విసిరేసింది. అది వెళ్లి ఎవరికో తగిలి, శాపనార్థాలు వినపడ్డాయి.

ఆ అబ్బాయి, ''నేను చెప్పినది నిజం. అవ్వగారికోసమే చూశాను. ఇలా ఒళ్లంతా కుషిృంచిపోయిన ఒక ముసిలామె ఫోటో నాకు కావలసొచ్చింది. ఏమంటే మా వార పత్రిక ఎడిటరు '' 'రాయలసీమలో క్షామపీడితురాలు అనే పేరుతో ఒక ముసిలామె బొమ్మను ముఖచిత్రంగా వెయ్యాలి' అన్నాడు. అట్టమీద ఆ పేరుతో ఈమెబొమ్మ వేస్తే నమ్మకానికి వీలుగా వుంటుందని తోచి, మీ అనుమతి తీసుకుని ఈమె ఫోటో తీసుకుందా మనుకున్నాను. మళ్ళీ, 'అడుగు తే ఏమనుకుంటారో' అనిపించి, వీలై తే మారాన్నుంచే తీసేద్దామని చూశాను. కాని దూరమైపోయింది...ఇప్పుడు సరియైన దూరంలో వున్నా రవ్వగారు! ఒక స్నాప్ తీసుకోమంటారా?'' అని ప్రాధేయపడ్డాడు.